# ఆడవాళ్లు అమ్మమ్మలు కాకుండా ఉండకూడదూ?

సావిత్రి అద్దంముందు నిల్చుని తల దువ్వుకుంటూ పాపిడిలో బయలు దేరిన తెల్లవెంట్రుకలను లాగి పారేయాలని తాపత్రయపడుతూంది. అవి చేతికి దొరక్క-దొరికినవి తెగక, తెగినవి నల్లవెంట్రుకలవుతూ నానా అల్లరి పెడుతున్నాయి.

కృష్ణమూర్తి జోళ్లు తొడుక్కుంటూ భార్యవంక చూశాడు. 'ఇంకా ముస్తాబే ఆరంభించలేదా? ఐదున్నర దాటింది. టైమవుతూంది' అన్నాడు.

'ఉండండి....ఏమండీ, ప్లీజ్ యిదిగో యీ తెల్లవెంట్రుకలు నాలుగూ లాగేద్దురూ. రాకుండా వున్నాయి....' అంటూ దగ్గిరికి వచ్చి తల వంచింది.

"అబ్బ వుండనిద్దూ వుంటే ఏం అయింది?"

"అసహ్యంగా కనిపిస్తున్నాయి....ముడేసుకుంటే బాగుండదు...."

"ఎన్నని పీకేస్తావు? వయసుదాటుతుంటే జుట్టు తెల్లబడుతుంది, దానికోసం యింత ఆరాటం ఎందుకు?....పదహారేళ్ళ బాలాకుమారిలా కనిపించడానికేనా యీ తాపత్రయం?...." టీజ్ చేశాడు భార్యని.

సావిత్రి దిగాలుపడి చూసింది. 'నిజంగా అంత వయసుమళ్ళిన దానిలా కనిపిస్తున్నానేంటండీ....ముసలిదానిలా అగుపిస్తున్నానా?....'

"ఏమిటి సిల్లీ ప్రశ్నలు....పద....పద టైమవుతూంది." జవాబు చెప్పకుండా తప్పించుకుంటూ తొందర పెట్టాడు.

"చెపుదురూ....ఎంతసేపు, పావుగంటలో తయారవుతాగా...." బ్రతిమిలాడింది.

సావిత్రి ముఖంలో ఆరాటం, ఉత్సుకత చూస్తూంటే నవ్వు వస్తూంది కృష్ణమూర్తికి. ఈ మధ్య అస్తమానూ ఏవో యిలాంటి ప్రశ్నలు వేస్తూనేవుంది.

'ఏమండీ, యిదివరకటికంటే రంగు తగ్గిపోయాను కాదూ, ఏమిటో ఆ రంగంతా పోయింది' అంటూ నిట్టూరుస్తూ అడుగుతుంది ఓసారి. 'జుట్టంతా వూడిపోతూంది. పల్చబడి పోయింది. ఏం చెయ్యడం' అంటూ వాపోతుంది మరోసారి. 'ఈకళ్ళక్రింద నల్లచారలేమిటండీ బయలుదేరాయి- ఏం చేస్తే పోతాయో తెలుసా మీకు' అంటూ ఆరాటంగా ప్రశ్నిస్తుంది మరోసారి.

'ఛ....ఎంత డైటింగ్ చేస్తున్నా యీ పొట్ట ఎందుకు ఇలా పెరుగుతూంది' అంటూ విసుక్కుంటుంది.

'ఏమండి ఏ ఎక్సరసైజ్ చేస్తే నడుం, నడుంక్రింద భాగం తగ్గుతుందో తెలుసా!' ఆరాలు తీస్తుంది.

'నిజం చెప్పండీ, ముప్పై ఎనిమిదేళ్ళ దానిలా కనిపిస్తానా నేను.... అంతవయసు వున్నట్టు అవుపిస్తానా....చిన్నదానిలా కనిపిస్తానా చెప్పండీ' అంటూ వేధిస్తుంది....

కృష్ణమూర్తి యిలాంటి ప్రశ్నలు తరుచు సావిత్రినోట ఈ మధ వింటూనే వున్నాడు. అంతేకాక భార్యలో బ్యూటీ కాన్షస్ ఎంత పెరిగిందో చూస్తూంటే అతనికి చిత్రంగావుంది. భోజనం సగానికి సగం తగ్గించేసింది రాత్రిపూట రెండంటే రెండు చపాతీలు తింటూ వళ్లు పెరగకుండా డైటింగ్ చేస్తూంది. ఉదయానే తలుపులు బిగించుకుని ఎక్సర్‌సైజులు చేస్తూంది. సాయంత్రంపూట తను రాలేనన్నా బలవంతాన రోజూ వాకింగ్‌కి తీసుకెడ్తూంది. అంతేకాదు జుట్టు వూడకుండా వారానికి రెండు సార్లు నూనెలు, ఆముదాలు మర్దించుకుని తలంటుకోవాలని ఎక్కడ చదివిందో, ఎవరో చెప్పారనో అలా చేస్తూంది. అంతేకాదు జుత్తు తెల్లబడకుండా నిగనిగలాడ్తుందని ఎవరో చెపితే మందారాకుల ముద్దలు నూరి

తలకి పట్టించుకోడం జుత్తు నెరియకుండా వుసిరికాయ పచ్చడి రోజూ తినడం, టర్కిష్ టవల్ బాత్స్ వగైరాలతో జుత్తుకి సంరక్షణలు చేస్తూంది. ఇవన్నీ అయ్యాక మొహానికి ముస్తాబులు సరే! ఏవో క్రీములు, లోషన్లు, అయింట్‌మెంట్సు రకరకాలు ముఖానికి రాత్రింబగళ్ళు పాము కుంటుంది. ఆ పైన పౌడర్లు, ఐబ్రో పెన్సిల్సు, లిప్‌స్టిక్‌లు అవీ సరేసరి!

ఇదంతా చూస్తుంటే భార్యకి శరీర పోషణపట్లవున్న శ్రద్ధాసక్తులకి మెచ్చుకోవాలా వద్దా అనిపిస్తుంది ఒకోసారి. ఈవిడకి యింత తాపత్రయం ఎందుకు అందంపట్ల అని మరోసారి అనుకుంటాడు! యివన్నీ వయసుని మరుగుపరిచి మభ్యపరచటానికేనా అనిపిస్తుంది! వయసుని దాచేసి చిన్న దానిలా కనిపించడానికి యింత తాపత్రయం ఎందుకో అతనికి అర్థం అయ్యేదికాదు! ఏ పెళ్ళి కానిపిల్లో, పెళ్ళి కావాల్సినవాళ్లో పడే తాపత్ర యాలు సావిత్రికెందుకో ననుకునేవాడు; పెళ్ళి కావల్సిన పిల్లలున్న సావిత్రికి యిప్పుడీ ఆరాటం ఏమిటోననిపించేది. ఆ మాట వుండబట్టలేక ఒకసారి అడిగేశాడు కూడాను.

"ఏం. ముప్ఫైఎనిమిదేళ్ళకే ముసలిదానిలా తయారవాలా.... నా ఖర్మకొద్దీ వేగిరం పెళ్ళి చేసేశారు మా వాళ్ళు, పిల్లలు తొందరగా పుట్టు కొచ్చారు.... అంత మాత్రానికి ముసలిదాన్నవుతానా. ముప్ఫైఐదేళ్ళవాళ్ళు యింకా పెళ్ళికాకుండా వుంటున్న ఈ రోజుల్లో నాకేం వయసుమించి...."

"వాళ్ళకి కాలం, ఖర్మ కలిసిరాక పెళ్ళి కానంతమాత్రాన వాళ్ళ వయసు ఇరవై ఏళ్ళ దగ్గిర ఆగిపోదుగా....వయసు పెళ్ళిఅయినా మానినా మొహంమీద తెలుస్తూనే వుంటుంది...."

ఆ మాటతో సావిత్రి దిగులుగా, చిన్నపుచ్చుకొన్న మొహంతో "అయితే నిజంగా నేను వయసుమళ్ళినదానిలా కనిపిస్తున్నానన్న మాట.... అంటూ మొదటి కొచ్చింది.

ఆ మాట గుర్తువచ్చి ఆరాటంగా చూస్తున్న భార్యని చిన్నపుచ్చటం ఇష్టంలేక, "ఏమో ఎవరికెలా కనిపిస్తావో కాని నాకు మాత్రం కాపురానికి వచ్చినరోజు ఎలా వుండేదానివో అలాగే పద్దెనిమిదేళ్ళ దానిలాగే కనిపిస్తున్నావు సుమా. అసలు నిజానికి అప్పటికంటె యిప్పుడే బాగున్నావు. నాకు అప్పుడు సన్నగా ఈదురోమని వుండేదానివి, కాస్త వళ్ళువచ్చి యిప్పుడే చక్కగా వున్నావు" అవకాశందొరికితే వృధాపుచ్చని మగ మనస్తత్వంతో సావిత్రిని దగ్గరకి లాక్కుంటూ అన్నాడు కృష్ణమూర్తి.

సావిత్రి బుగ్గలు ఎర్రబడ్డాయి! వదిలించుకుంటూ 'నిజం చెపుదురూ. మీరెప్పుడూ యిలాగే అంటారు....'

"అదిగో చెప్పు, చెప్పు అంటావు. చెపితే నమ్మవు! నేనేం చేసేది. ఇంతకీ ఈ రోజు సినిమాకి వెళ్ళడం వుందా లేదా...."

"ఇదిగో అయిపోయింది. ఐదు నిమిషాలు...." ముడి చుట్టుకోడం మొదలుపెట్టింది సావిత్రి.

సావిత్రికి భర్తమాటలమీద నమ్మకంలేదు, మొగుళ్ళందరూ పెళ్ళాలను మంచిచేసుకోడానికి యిలా అంటారని సావిత్రి నమ్మకం. ఎంత కోతిలావున్నా వాళ్ళవసరం కోసం రంభలా వున్నావు అంటూ ఉబ్బేస్తారని సావిత్రికి తెలుసు. అంచేత నిజానిజాలు మొగుడిద్వారా రాబట్టడం కష్టం అని తెల్సినా అలా సందర్భం దొరికినప్పుడల్లా ఆ ప్రసక్తి ఎత్తి అడుగుతూనే వుంటుంది!

మొగుడ్నికాక ఇంకెవరినైనా యీ ప్రశ్నలు అస్తమానం ఏమని వేస్తుంది. ఏ కూతురునో అడిగితే 'అబ్బ! నీకస్తమానం ఇదే గొడవ. సిల్లీగా అడుగుతావు. నాకు తెలియదు బాబు' అంటూ విసుక్కుంటుంది.

"ఏ స్నేహితురాలిదగ్గిరో లౌక్యంగా ఈ ప్రసంగం ఎత్తితే ముసలివాళ్ళంకాక పడుచువాళ్ళం అవుతామేమిటి రోజు రోజుకి....అయిపోయింది మన కాలం....అమ్మమ్మలవుతాం యింక" అంటూ చప్పరిస్తారు.

ఆ చచ్చుకబుర్లు వింటే సావిత్రికి వళ్లుమంట! నలభై ఏళ్ళన్నా లేక ముందే ఈ ఆడవాళ్ళు యీ దేశంలో, ముసలమ్మల్లా యీసురోమంటూ ఎందుకు వుంటారో ననుకునేది కోపంగా. విదేశాలలో నలభై ఏళ్ళేమిటి ఏభై ఏళ్ళు వచ్చినా ఎంత చలాకీగా వుంటారు! అనుకుంటూ ఈ దేశాన్ని, ఈవిడ వాళ్ళని కలిపి తిట్టుకునేది మనసులో! 'ఆ పాశ్చాత్యదేశాల మాదిరి మనదేశంలో ఎలా వుంటారు. మనది ఉష్ణదేశం అలా వుండడం అసంభవం' అంటాడు కృష్ణమూర్తి, సావిత్రి పైకే ఆ మాట అన్నప్పుడు. కాని ఆ మాట నిజంకాదని సావిత్రి వాదన! శరీర పోషణబట్టి, మనిషి స్వభావాన్నిబట్టి వుంటు దంటుంది.

అందుకె సావిత్రి తనని ఫిట్‌గా వుంచుకోడానికి తాపత్రయ పడ్తుంటుంది. ఆ తాపత్రయం ముదిరి యీమధ్య పిచ్చిగా మారింది. భార్యకింత పిచ్చి ఎందుకో కృష్ణమూర్తికి అర్థం గాకపోవడం సహజమే!

కానీ సావిత్రిని నిలవేసి ఆ మాట అడిగితే జవాబు చెప్పలేదు. అసలు యీ అలంకరణపట్ల యింత శ్రద్ధాసక్తులు ఎలా ఆరంభించాయో, ఇలా చిన్నపిల్లలా కనపడాలన్న తాపత్రయం ఎందుకో, వయసుని దాచాలన్న ఆరాటం అవీ ఎందుకో సావిత్రికే తెలియదు. కానీ అలా కనపడాలన్న కోరిక మాత్రం సావిత్రిలో రోజురోజుకి పెరుగుతూంది.

ఓ రెండు మూడేళ్ళముందు ఇంత చాదస్తం వుండేదికాదు....ఓసారి కృష్ణమూర్తి మేనేజింగ్ డైరెక్టరు వచ్చాడని ఇంట్లో డిన్నరుపార్టీ ఇచ్చాడు. సహోద్యోగులు, ఇతర పెద్ద ఉద్యోగులు అంతాకలసి ఓ పది పదిహేను ఫేమిలీలవాళ్ళు వచ్చారు. పార్టీ చాలా గ్రాండ్‌గా జరిగింది. హాట్ డ్రింక్స్, సాఫ్ట్‌డ్రింక్స్, చిప్స్, జీడిపప్పుల సరఫరాలు జోరుగా సాగాయి.

రాగానే 'మీట్ మైవైఫ్'అంటూ సావిత్రిని డైరక్టర్‌కి పరిచయం చేశాడు కృష్ణమూర్తి. అతను సావిత్రిని కళ్ళతో మధువుతోపాటు త్రాగేసే

టట్టు చూడ్డం మొదలుపెట్టాడు. అతని చూపులకి కాస్త ఇబ్బందిపడ్డా లోలోపల గర్వపడింది సావిత్రి....'చార్మింగ్ వైఫ్' అంటూ ఏదో ప్రశంసా పూర్వకంగా అతను కృష్ణమూర్తితో అంటున్న మాటలు పూర్తిగా విన పడకపోయినా తన గురించేనని మరి కాస్త గర్వపడింది.

డిన్నరయ్యాక లోపల్నించి ప్లేటులో కిళ్ళీలు తెచ్చింది కూతురు. డ్రింక్స్ అవీ వున్న పార్టీలప్పుడు పిల్లలని కలవనీయక పోవడం అల వాటు ఇంట్లో। కూతుర్ని కేకేశాడు కృష్ణమూర్తి పట్టుకురమ్మని. కూతురు రాగానే అక్కడివాళ్ళకు పరిచయం చేశాడు. ఆ మాట వినగానే డైరక్టరు కుర్చీలోంచి గెంతినంత పనిచేసి "మీ అమ్మాయా....ఇంత పెద్దకూతురు మీకుందని కలలో కూడా అనుకోలేదు" అంటూ ఇంగ్లీషులో బోలెడు ఆశ్చర్యం వ్యక్తం చేశాడు సావిత్రితో.

ఆ మాట ఓ పెద్ద క్లాంప్లిమెంటులా అనిపించిందిసావిత్రికి. నిజంగా తను అంత అందంగా, చిన్నదానిలా వున్నానన్న మాట అనుకుంటూ పొంగి పోయింది. ఆ క్షణంలో కూతురు పైకి వచ్చి తన వయస్సుని నలుగుర్లో చెప్పక చెప్పినందుకు కోపం కాకపోయినా అదోలా అన్పిం చింది. అయితే.... పిల్లలని కనక చూడకపోతే తను పాతికేళ్ల దానిలా కన్పిస్తుందన్నమాట! ఆ మాట పదే పదే అనుకుంది. అందరితో ఏవో మాట్లాడుతున్నా ఆ క్షణంలో సావిత్రి ఆలోచన అదే.

నిజానికి సావిత్రి ఈ సౌందర్యంలోతపన పెరగటంఅదే మొదలు! అందరు వెళ్ళాక డ్రస్సింగ్ టేబుల్ ముందు కూర్చుని తన అందం నిశితంగా గమనించడం మొదలు పెట్టింది. నిజంగానే తను అందంగా వుంది! చిన్నదానిలా, మహా అయితే ఓ పాతికేళ్ళ దానిలా కనిపి స్తూంది....

బట్టలు మార్చుకుంటూ తదేకంగా అద్దంలో చూసుకుంటున్న భార్యని కాస్త ఆశ్చర్యంగా చూశాడు. కృష్ణమూర్తి "ఏమిటలా చూసు కుంటున్నావు నీ అందానికి నీవే మురిసిపోతున్నావా?" నవ్వుతూ అడిగాడు.

"ఆ.... మురిసిపోతున్నాను.... పోనీ మీరే విన్నారుగా మీ డైరెక్టరు ఏమన్నాడో.... మీ రెప్పుడయినా ఒక్క సారయినా అలా పొగిడారా ?" సగం వేళాకోళంగా సగం నిష్ఠురంగా అంది సావిత్రి.

"ఓస్, అదా.... ఏదో అన్నాడు. హోస్టువిగదా అని మాత్రం పొగడకపోతే ఎలా అనుకునివుంటాడు కాస్త.... అక్కడున్న అందరిలో నీవే బాగున్నావాయే ...అంచేత ఏదో అన్నాడు.... కొంపదీసి నిజం అనుకుంటున్నా వేమిటి?" టీజ్ చేశాడు.

అవునులెండి. నిజం ఒప్పుకుంటే నామోషి కాబోలు...."

"బాగుంది అయితే రెండు పూటలా నీ దగ్గిర కూర్చుని నీ అందాన్ని స్తుతిస్తూ భజన చెయ్యమంటావేమిటి .... బాగున్నావనే కాదు టోయి పెళ్ళాడింది....అప్పటికే పెళ్ళాంమొహం ముడుచుకోవడంచూసి సమర్థించుకుంటూ నవ్వుతూ అన్నాడు కృష్ణమూర్తి.

మొత్తానికి ఆ డైరెక్టరు నిజంగా అన్నా, యథాలాపంగా అన్నా.... ఆ అన్న రెండు ముక్కలకి సావిత్రి చాలా ప్రాముఖ్యంఇచ్చింది. అప్పటి నించే శరీర సౌందర్యం పట్ల శ్రద్ధాసక్తులు ఎక్కువయ్యాయి .... అలంకారాలు హెచ్చాయి.... ఆరాటం హెచ్చింది.

చక్కగా అందంగా ముడివేసుకుని, పౌడరద్దుకుని కనుబొమ్మలు దిద్దుకునిలిప్‌స్టిక్ వేసుకుని ఏఫారెన్‌నైలానుచీరో కట్టుకుని, స్లీవ్‌లెస్‌బ్లౌజ్ తాలూకు తన నున్నటి బుజాలని చూసుకుంటూ మురిసిపోయేవేళ.... అద్దంలో వెనుకనుంచి ఏ కూతురు నీడో కనపడగానే కలవరపడిపోయేది సావిత్రి....ఛా....తనకి పిల్లలు వేగిరం పుట్టేసి తనని పెద్దదాన్ని చేసేసి కూర్చోబెట్టారు..... తనీడు వాళ్ళకి పదేసి ఏళ్ళ పిల్లలు కంటె లేరు....తనకి పద్దెన్మిదేళ్ళ కూతురు, పదిహేనేళ్ళకూతురు పన్నెండేళ్ళ కొడుకు.... వాళ్ళని చూస్తుంటే సావిత్రికి తన వయస్సుని వాళ్ళు డప్పువేసి చాటుతున్నారన్నంత బాధగా వుండేది.

ఆ బాధ కృష్ణమూర్తి అప్పుడప్పుడు కూతురు పెళ్ళిమాట ఎత్తినప్పుడల్లా మరింత ఎక్కువయ్యేది. "ఇంక సంబంధాలు చూడడం ఆరంభిస్తే బాగుంటుందనుకుంటాను." అనేవాడు జ్ఞాపకం వచ్చినప్పుడల్లా.

ఉలిక్కిపడేది సావిత్రి. "అప్పుడే దానికి పెళ్ళేమిటి బాబూ.... ఇంకో మూడు నాలుగేళ్ళుపాటు ఆ మాట ఎత్తకండి. దాన్నయినా కాస్త హాయిగా వుండనీయండి కొన్నాళ్ళు...." విసుగ్గా అనేది, ఆ విసుగు వెనకాల వేరే అర్థం వుంది సావిత్రి మాటలో.

బాగుంది. ఇరవై వస్తున్నాయి దానికి. యిప్పటినుంచి సిన్సియర్‌గా మనం ట్రైచేస్తే ఓ రెండేళ్ళైనా పట్టదేమిటి సంబంధం కుదిరేసరికి....అది పెళ్ళీడు కాదేమిటి ?" అనేవాడు కృష్ణమూర్తి సావిత్రి మాటలలో వేరే అర్థం వుందని తెలియక.

"ఆ....ఆ.... పెళ్ళి చేసేయండి .... అది మర్నాటినించి పిల్లల్ని కంటుంది. చక్కగా మీరు నేను అమమ్మ తాతగారులయి మూలకూర్చుందాం...." భర్తకి ఏమని బోధపరచాలో స్పష్టంగా తన అభిప్రాయం చెప్పలేక కసిగా అంది సావిత్రి. కృష్ణమూర్తి కాస్త ఆశ్చర్యంగా చూశాడు. భార్య మనస్తత్వం ఏమిటో అతనికి అర్థం కాలేదు. ఎవరైనా బరువులు బాధ్యతలు సాధ్యమైనంత త్వరగా తీర్చుకుందామని అనుకుంటారు. అలాంటిది భార్యే కూతురు పెళ్ళి యిప్పట్లో వద్దనడం ఏమిటో అతనికి అర్థం అయ్యేదికాదు.

'ఏమో బాబూ' మీకు తాత నవాలని ముచ్చటగా వుందేమో కానీ ఇప్పటినుంచి అమ్మమ్మని అవాలని నాకు లేదు సరదా....ఛా.... యిప్పటినించి నన్ను అమ్మమ్మని చేసేయకండి" అనేది. అప్పుడప్పుడు హాస్యంగా అంటున్నట్టు.

ఇంట్లో కూతుళ్ళు యథాలాపంగా 'అమ్మా. ఈ ఫుల్‌వాయిల్ చీర నీ కెందుకమ్మా నాకిచ్చేయి' అన్నా, ఈ నైలక్స్ నీకేం బాగుంటుం

దమ్మా నా కిచ్చేయకూడదూ' అని కూతురడిగేసరికి సావిత్రికి ఎక్కడ లేని కోపం వచ్చేది.

"ఏం, ఎందుకు బాగుండదు. నీకేనా బాగుంటుంది. నాకు కావాలని కొనుక్కున్నాను. నేనివ్వను. కావలిస్తే నీకు మరొకటి కొంటాను. కానీ ఇదడగకు" అనేది కోపంగా. సావిత్రి వార్డ్‌రోబ్ నిండా ఈ మధ్య వాయిల్సు,జార్జెట్సు, నైలానులు, డ్రయిలాన్స్, ఎల్‌ఫార్స్ వగైరా వగైరా లన్నీ చేరుస్తూంది. తండ్రి, కూతుళ్ళు కొన్నాళ్ళు ఆశ్చర్యంగా చూశారు.

ఓ సారి కృష్ణమూర్తి వుండబట్టలేక అడిగేశాడు .... 'ఏమిటి ఈ చీరలు నీకా.... కొంటుంటే, యింకా పద్మకేమో అనుకున్నాను' అన్నాడు సావిత్రి తీక్షణంగా చూసింది....

"ఏం నేను కట్టుకోకూడదనా ఆ చీరలు మీ ఉద్దేశంలో."

"అబ్బే.... అడుగుతున్నాను.... ఆ చీరలు చూస్తే అలా అనిపించింది....పిల్లలకేమో అనుకున్నాను...." నానుస్తూ అన్నాడు.

"ఫాషన్స్ తెలీకపోతే సరి .... ఇప్పుడంతా ఇలాంటివే కట్టుకుంటారు...." ఏమనలేక వూరుకున్నాడు కృష్ణమూర్తి.

"అమ్మా స్లీవ్‌లెస్ బాగులేదమ్మా నీకు. చేతులున్న జాకట్టు తొడుకుంటేనే బాగుంటుంది !" అంది ఓసారి పెద్ద కూతురు. వళ్ళు మండిపోయింది సావిత్రికి. ఇదీ తనకి చెప్పడమేనా ! అంటే నలభై ఏళ్ళదానివి నీకు స్లీవ్‌లెస్ ఏమిటనా దాని ఉద్దేశం !

"నీ అభిప్రాయం అడిగినపుడు చెపుదువుగానిలే .... నోరు మూసుకుని వెళ్ళవతలకి" అని కసిరేసింది.

ఇలాగే ఎన్నో సందర్భాలలో తన వయస్సు వెల్లడయ్యేట్టు ఎవరయినా ఏ చిన్నమాట అన్నా సావిత్రి సహించేదికాదు .... తండ్రి, పిల్లలు సావిత్రిలో వస్తున్న మార్పులు చిత్రంగా చూసేవారు.

* * *

8)

ఆ రోజు కాలేజీలో వార్షికోత్సవాలు అవుతున్నాయి. పద్మ రెండు మూడు కాంపిటీషన్స్‌లో ప్రైజులు గెల్చుకుంది. అంతేకాక ఓ నాటకంలో పోర్షనుకూడా వుంది, అంచేత ప్రత్యేకం ఇంటరెస్టుతో వెళ్ళారు సావిత్రి కృష్ణమూర్తి.

కృష్ణమూర్తి, సావిత్రి ఆహూతులస్థానాల్లోకూర్చున్నారు. ఏవేవో వెరైటీ ఎంటర్ టెయిన్‌మెంట్సు జరుగుతున్నాయి....అవి చూస్తుంటే వెనక రెండు వరసల తర్వాత కూర్చున్న కొందరు స్టూడెంట్ల మాటలు అప్రయత్నంగా సావిత్రి చెవుల్లో దూరాయి. తన గురించి వినగానే సావిత్రి శ్రద్ధగా ఆ మాటలు వినడం ఆరంభించింది.

"వరేయ్....ఎవరురోయ్ ఆవిడ....మహా టిప్‌టాప్‌గా వుందే...."

"ఎవరు ఆ గులాబి షిఫాన్ చీరావిడా? థర్డ్ బి. ఎ. పద్మజ లేదూ వాళ్ళమ్మ...."

"నిజం!"

"ఏం. అంత ఆశ్చర్యం...."

"అంత కూతురుండి యీవిడీవేషం ఏమిటి!... పద్మజ మోడెస్ట్‌గా ఉంటుంది. యీవిడేమిటి చిన్నపిల్లలా కూతుర్ని మించి తయారయింది...."

"అంతేలే... ఎప్పుడూ అలాగే తయారవుతుంది....నలభై ఏళ్లుండి, పాతికేళ్ళదానిలా కనిపించడానికి తాపత్రయపడ్తుంది....పద్దెనిమిదేళ్ళదానిలా ప్రవర్తిస్తుంది....ఇంకా ఇవాళ కాస్త నయం....ఒకోసారి చూడాలి ఆ వేషం... ఓ ఆ లిప్‌స్టిక్‌లు, ఆ కనుబొమ్మలు దిద్దుకోడం, ఆ రంగులు, ఆ చీరలు, ఆ వేషం బాగా వేస్తుందిలే...."

"నలభై వుంటాయంటావా? అన్ని ఏళ్ళదానిలా లేదురా...."

"నీ మొహం....ఆ మేకప్ తీసేసినప్పుడు చూడు....లైట్ల వెలుగులో దట్టంగా కొట్టిన మేకప్‌లో దూరానికి అలాగే కనిపిస్తుంది.... అయినా ఇరవై ఏళ్ళ కూతురుంది....అది చాలదూ నిదర్శనం........అంత కూతుర్ని ఉంచుకొని యీవిడో చిన్నపిల్లలా తయారవడానికి సిగ్గేయదేమో........"

వాళ్ళు రహస్యంగా మాట్లాడుకున్నాం అనుకుని అన్న మాటలన్నీ అక్షరం పొల్లుపోకుండా సావిత్రి చెవుల్లో దూరాయి....సావిత్రి మొహం నల్లబడి పోయింది. ఛ....ఛ....వెధవలు....ఎంత నీచంగా, అసభ్యంగా మాట్లాడుతున్నారు తన గురించి....సావిత్రి శరీరం వణికింది ఎందుకో! వెనక్కి తిరిగి చూడాలని ప్రయత్నించి వెనక్కి తిరగలేకపోయింది. ప్రక్కన భర్త విన్నాడేమో అన్న అనుమానంతో చూసింది. కృష్ణమూర్తి పోగ్రాంలో లీనమయ్యాడు. మరోక్షణం అక్కడ వుండలేక పోయింది సావిత్రి. ఏదోచెప్పి ఇంటికొచ్చేసి ప్రక్కమీద వ్రాలిపోయింది.

ఆ రాత్రి ఒక్కక్షణం నిద్ర పట్టలేదు సావిత్రికి. ప్రొద్దుటలేస్తూనే బాత్‌రూమ్‌లో అద్దంలో మొహం చూసుకొంటూంటే........ మేకప్పులేని మొహం... బిగువుసడలి జారిన చెంపలు కళ్ళక్రింద నల్లటిమచ్చలతో.... కాస్త లోతుకుపోయిన కళ్ళు....రంగు తగ్గిపోయిన మొహం....ఒకవంతు నెరసిపోయి వెండితీగల్లా మెరుస్తున్న జుత్తు....ఓ నలభై ఏళ్ళ ఆకారం కనపడి—త్రుళ్ళిపడింది సావిత్రి. మళ్ళీ....మళ్ళీ చూసుకుంది అద్దంలో.... ఎంత చూసుకున్నా....ఒక్కొక్కసారి చూస్తున్నకొద్దీ....ఒక్కో ఏడు పైబడి వయసు పెరుగుతున్న సావిత్రి ఆకారం కనిపిస్తూంది తప్ప....పాతికేళ్ళ సావిత్రి అద్దంలో కనబడడం లేదు....

వెధవ అద్దం....ఎంత అబద్ధం ఆడింది....ఎంత మోసపుచ్చింది ఇన్నాళ్ళు!....ఆ క్రీములోషన్స్ బాటిల్సుతీసి అద్దంమీద విసిరేయాలన్నంత ఆవేశం వచ్చింది సావిత్రికి. ఈ లోపల కృష్ణమూర్తి 'ఏం చేస్తున్నావు లోపల....ఎంతకీ రావేం? కాఫీ యీయవేమిటి?' అని కేక వేయగానే నెమ్మదిగా యివతలికి వచ్చింది. 'అలా వున్నావేం' అన్నాడు. ఆశ్చర్యంగా భార్య మొహంలోకి చూస్తూ.

"ఏం లేదు" భారంగా అంటూ వంటింటిలోకి వెళ్ళిపోయింది సావిత్రి.

ఆ రోజు ఆదివారం. ఉదయం ఇంగ్లీషు మార్నింగ్‌షోకి వెళ్ళడం అలవాటు, ఆ రోజు సావిత్రికి వెళ్ళాలని లేకపోయినా మంచి సినిమా నిఅ కృష్ణమూర్తి బలవంతం చేశాడు.

తయారవడానికి వార్డ్ రోబ్ తీయగానే హాంగర్లకి వ్రేలాడుతున్న రకరకాల చీరలనిచూస్తూ ఓ క్షణం నిలబడిపోయింది సావిత్రి. ఓ నైలక్స్ చీరమీదకి వెళ్ళిన చెయ్యిని అప్రయత్నంగా వెనక్కు లాగేసుకుంది సావిత్రి.

చిన్న జరీవున్న పట్టుచీరతో, చేతులున్న బ్లౌజ్‌తో తయారయిన సావిత్రిని ఆశ్చర్యంగా చూశాడు కృష్ణమూర్తి. మెచ్చుకోలుగా సంతోషంగా చూస్తూ "ఇవాళ చాలా బాగున్నావు. నీకీ డ్రస్సింగ్ బాగా నప్పింది, ఆ సిల్కులకంటె...." అన్నాడు తృప్తిగా.

'అమ్మా, రోజూ యిలా కట్టుకో అమ్మా' అన్నాడు ఏం తెలియని కొడుకు కూడా.

"అమ్మయ్య, ఎన్నాళ్ళకి చూశాను నిన్ను యిలా" అంది పెద్ద కూతురు....

"అమ్మలా వున్నావు నిజంగా యివాళ" అంది చిన్నకూతురు నవ్వుతూ. సావిత్రికి తిక్కపుట్టింది వాళ్ళమాటలతో. "ఏం ఇన్నాళ్ళు యెలా వున్నాను....సానిదానిలా కనిపించానేమిటి ఆ చీరలు కట్టుకుంటే" అంది తీక్షణంగా.

"ఛా....అదికాదు...ఇలావుంటే ఎంతో డిగ్నిఫైడ్‌గా వున్నావు..."

"మరెందుకు చెప్పలేదు ఇన్నాళ్లూ?"

"నీవు సరదాపడుతుంటే నేను నిరుత్సాహపరచడం ఎందుకని వూరుకున్నాను....అసలు చెప్పినా నా అభిప్రాయం పాటిస్తావని నమ్మకం లేక"....చిన్నగానవ్వాడు కృష్ణమూర్తి.

ఆ రోజల్లా అన్యమనస్కంగానే వుంది సావిత్రి. సావిత్రి బాధ సాయంత్రం కూతుళ్ళిద్దరూ డాబామీద కూర్చుని అనుకుంటున్న మాటలు వినగానే మరింత పెరిగింది.

ఆరేసిన బట్టలు తెద్దామని డాబామీదకి వెడుతూ పై మెట్టు దగ్గిర ఆగిపోయింది మాటలు విని....

"అమ్మ రోజూ ఇవాళలా తయారయితే బాగుండును. అమ్మకసలు ఆ నైలాన్లు, స్లీవ్‌లెస్‌లు అవి నప్పవు. నిన్న మా కాలేజీలో పిల్లలందరూ అమ్మవంక ఎలా చూశారో తెలుసా, వాళ్ళు అదోలా నవ్వుకున్నారు. నా కెంత సిగ్గేసిందనుకున్నావు....మా ఫ్రెండ్సు అనేశారు కూడాను...."మీ అమ్మగారే అంతటి టిప్‌టాప్‌గా తయారయితే నీవేమిటోయ్ ఇలా ఉంటావు" అన్నారు. చచ్చిపోయాను సిగ్గుతో. స్టూడెంట్స్ కామెంట్స్‌విని తలెత్తుకోలేకపోయాను...."

"అమ్మ తను ఫేషన్‌బుల్‌గా తయారవుతుంది గానీ, మనం కొంచెం ఏదన్నా షోకు చేసుకుంటే తిడుతుంది....పిచ్చి వేషాలేమిటి అని కేకలేస్తుంది...." రెండోకూతురు అంటూంది.

"ఆఁ....గొప్పగా....చిన్నపిల్లలా తయారయి ఎంగ్‌గా కనిపిస్తున్నా ననుకుంటుంది కానీ చూసేవాళ్ళందరూ ఏమనుకుంటున్నారో తెలియదు.."

సావిత్రి నిర్ఘాంతపోయి నిల్చుండిపోయింది. మొహం ఎర్రబడి పోయింది. తన పిల్లలు....తన కడుపున పుట్టిన పిల్లలు....వాళ్ళ దృష్టిలో తన విలువ ఇదా ! !

గిర్రున తిరిగి క్రిందికి వచ్చేసింది. ఆవేశం అణిగిన మరో గంటకి నెమ్మదిగా లేచి బీరువా తెరిచింది....రక రకాల చీరలు.... ముచ్చటపడి, మోజుపడి కొనుక్కున్న చీరలని చూస్తుంటే తన వయసుని దాచి తనని పాప్యులర్ చేస్తాయనుకున్న చీరలు తనని ఎంత దగా చేశాయి....తనని ఎంత కించపరిచాయి....!!?

అలాచూస్తూ ఏదో ఆలోచించి కూతుళ్ళిద్దరినీ పిలిచి ఈ చీరల్లో మీ కిద్దరికి ఏం కావాలో అవి తీసుకోండి! అంది. వాళ్ళిద్దరూ మొహాలు చూసుకున్నారు గిల్టీగా.

"ఏం ఎందుకు యిచ్చేస్తున్నావు," అంది పద్మ.

"ఏం లేదు. నాకక్కరలేదు. మీకు కావలిస్తే తీసుకోండి" అంది పొడిగా సావిత్రి.

అంతేకాదు ఆ రాత్రి భర్తతో "మీ అమ్మాయికి పెళ్ళి చెయ్యరేమిటి? సంబంధాలు చూడడం ఆరంభించండి" అంటున్న భార్యని తెల్లబోయి తదేకంగా చూశాడు. భార్య మొఖంలోకి చూసిన కృష్ణమూర్తికి ఏదో అర్థమయింది .... ఆమె మొహం చూస్తే ఆ క్షణాన ఎంతో జాలిని పించింది. బుజంమీద చేయి వేసి ప్రేమగా, ఓదార్పుగా 'పిచ్చిదానా.... నా కర్థం అయింది నీ బాధ.... ఇన్నాళ్ళు ఏదో అనుకున్నాను....ఇందుకా యింత తాపత్రయపడ్డావు .... పోనీ ఇప్పటికయినా నిజం గుర్తించావు.... చూడు సావిత్రీ .... ఓ చెట్టుకి ఓ పూవు పూయడం ఎంత సహజమో, అది వాడి కొన్నాళ్ళకి రాలిపోవడమూ అంత సహజం. ఆ పూవుని నీ వెంత తాపత్రయపడి, ఎంత జాగ్రత్తగా శ్రద్ధతీసుకొని కాపాడినా దానిని వాడి రాలిపోనీయకుండా ఆపగలవా ? మహా అయితే రెండు రోజులలో వాడేదానిని .... నీ పోషణతో మరో రెండు రోజులు తాజాగా ఉంచ గలవుగానీ అసలు వాడకుండా వుంచడం నీ తరమా ?.... నీ వెంతచేసినా అప్పుడే విచ్చిన పువ్వులా యీ వాడబోయే పూవుని తాజాగా కన్పించే టట్టు చేయగలవా ! వాడే పూవుని తాజాపూవు అని కళ్ళువున్న ఎవ్వరూ నమ్మరు. నీవు దానికి ఎన్ని అలంకారాలు చేసినా ! ఈమాత్రం చిన్న విషయం నీకెందుకు తట్టలేదు !.... ... ... ... ....

సావిత్రి చప్పున కృష్ణమూర్తి నోటిమీద చెయ్యి అడ్డుపెట్టి.... యింక చెప్పకండి....అంది ఆదోలా.

-)o(-